# పీడితహృదయం

“ఎక్కడికిరా?” అని అడిగాడు కామయ్య.

జుట్టు దువ్వుకొని ఉతికిన చొక్కా వేసుకుని బయల్దేరిన రాముడు మేనమామ ప్రశ్న విని, వరండాలోవాడు వరండాలోనే ఆగిపోతూ— “మీటింగుకి వెళ్తున్నాను. ఇప్పుడే వస్తాను” అన్నాడు.

మీటింగుకి అనేటప్పటికి కామయ్యకు ఎక్కడలేని కోపం వచ్చింది “ఓరి వెధవా....నీ మొహానికి మీటింగులు కావలసి వచ్చినై? ఇంతకూడు వడేస్తావుంటే తిని వుండలేక—” అని నానా చివాట్లు పెట్టాడు. చివరికి గడప దాటి బయట అడుగు పెట్టితే ముక్కలు ముక్కలుగా నరుకుతానన్నాడు.

రాముడు కిక్కురుమనకుండా ఇంట్లోకివెళ్ళాడు. వాడు తల్లిపోయిన దగ్గర్నుంచీ మేనమామ ఇంట్లోనే పెరుగుతున్నాడు. మేనమామ తిట్టినా, తుమ్మినా ఎదురు తిరగాలనేభావం వాడికెన్నడూ కలుగలేదు.

కాని మీటింగుకి వెళ్ళొద్దనేటప్పటికి వాడికి ఉక్రోషం వచ్చింది. కమ్యూనిస్టుల్ని చూడాలనీ, వాళ్ళ ఉపన్యాసాలు వినాలనీ, వాళ్ళతో మాట్లాడాలనీ ఎన్నాళ్ళనుంచో కుతూహలపడుతున్నాడు. ఈ మీటింగు కోసం నెలరోజుల్నుంచీ క్షణాలు లెక్కపెట్టుకుంటూ కూర్చున్నాడు.

రాముడికి ఇంత ఆపేక్ష కలగటానికి కారణం లేకపోలేదు. వాడు చదువుకునే స్కూల్లో రంగడూ, గంగడూ, అనే యిద్దరు కుర్రవాళ్ళున్నారు. వాళ్ళెప్పుడూ స్కూలుకి సరిగ్గా వచ్చేవాళ్ళుకాదు, ఎప్పుడూ పాఠాలు చదివిన పాపాన పోయేవాళ్ళుకారు. ఇవ్వాళ ఇక్కడుంటే రేపు

మరొక వూళ్లోవుండేవారు. ఎల్లుండి ఇంకొక వూరు. ఊళ్ళోవున్న కాసేపయినా గుక్కతిరక్కుండా తిరుగుతుండేవాళ్ళు ఉండి వుండి నాలుగైదు రోజులు అయిపు లేకుండా పోయేవారు.

ఒకరోజు రంగడూ, గంగడూవచ్చి, "మనం స్కూలుకు వెళ్ళవద్దు మనతోటి విద్యార్థుల్ని పరీక్షకు పంపకుండా హెడ్‌మాష్టరు ఆపాడు. వాళ్ళని బడికి పంపేవరకూ మనం స్కూల్లో అడుగుపెట్టవద్దు" అని చెప్పారు.

విద్యార్థులు సరేఅంటే సరే అన్నారు. ఒక్కడుకూడా స్కూలికి వెళ్ళకుండా కూర్చున్నారు. రాముడు పుస్తకాల్తో తయారయేటప్పటికి రంగడూ, గంగడూ తటస్థపడి స్కూలుకి వెళ్ళకుండా చేశారు. అదేమిటో వూళ్లోవున్న పెద్దవాళ్ళంతా వచ్చి రంగడితో, గంగడితో మాట్లాడేవారు చివరికి హెడ్ మాష్టరు ఆ విద్యార్థుల్ని పరీక్షకు పంపాడు. అంతా రంగడికీ గంగడికీ జై" అన్నారు. గంతులు వేసుకుంటూ స్కూలుకు వెళ్ళారు.

రాముడికేమీ అర్థంకాలేదు. హెడ్‌మాష్టరు ఆ విద్యార్థుల్ని మళ్ళీ పరీక్షకు ఎందుకు పంపాడు? విద్యార్థులు స్కూలుకి వెళ్ళకపోతే హెడ్ మాష్టరు కేమినష్టం? ఊళ్లో పెద్దలంతా రంగడితో ఏం మాట్లాడారు? ఊళ్ళో పెద్దలకీ, దీనికీ ఏం సంబంధం? రాత్రంతా ఇవే ఆలోచనలు. రాముడికి నిద్ర పట్టలేదు. తెల్లవారి, మేనమామ వాడిని పిలిచి, "ఒరేయ్ రంగడితో గంగడితో స్నేహంచేసేవు, జాగ్రత్త!" అన్నాడు. రాముడేమీ మాట్లాడలేదు

మేనమామ, "వాళ్ళు కమ్యూనిస్టులు జాగ్రత్త!" అన్నాడు.

అప్పట్నుంచీ కమ్యూనిస్టులంటే ఎవ్వరో తెలుసుకోవాలని బుద్ధి పుట్టింది రాముడికి. ఎవ్వరికీ తెలియకుండా రంగడితో, గంగడితో స్నేహం చెయ్యడానికి ప్రయత్నించాడు వాళ్ళేం చేస్తారు? ఏం మాట్లాడుకుంటారు? ఎందుకిదంతా? విద్యార్థుల్ని పరీక్షకు పంపకపోతే వీళ్ళకేం నష్టం? కాని రంగడూ, గంగడూ రాముణ్ని పిల్లవానికింద కట్టి దగ్గరకు రానిచ్చేవాళ్ళు కాదు. దానిమీద యితర విద్యార్థుల్ని, "కమ్యూనిస్టులు ఏం చేస్తారు?" అని

అడిగిచూశాడు. వాళ్ళు జవాబు చెప్పకుండా వాణ్ణి వింతగా చూచి వూరు కున్నారు

ఒకడు మాత్రం "గల్లంతు" అన్నాడు.

"ఎందుకు?"

ఈ ప్రశ్నకుమాత్రం ఎవ్వరూ జవాబు చెప్పలేదు. రాముడికి ఆరాటం హెచ్చింది....ఇటువంటి సమయంలో ఆ వూళ్లో కమ్యూనిస్టులు మీటింగు పెడతారనీ, ఉపన్యాసాలిస్తారనీ, కామ్రేడ్ సోమేశ్వర ప్రసాద్ అధ్యక్షత వహిస్తాడనీ తెలిసింది. రాముడి సంతోషం చెప్పలేం! రోజులు లెక్కపెట్టుకుంటూ కూర్చున్నాడు. నిముషాలు లెక్కపెట్టుకుంటూ కూర్చు న్నాడు.మీటింగువేళ అయింది జుట్టుదువ్వుకొని, వుతికిన చొక్కాతొడుక్కొని వెళ్ళబోయేసరికి మేనమామ వీల్లేదన్నాడు. గడపదాటి బయట అడుగుపెడితే వరికిపోగులు పెడతానన్నాడు.

రాముడికి ఉక్రోషం వచ్చింది.

రాముడికి కోపం వచ్చింది.

రాముడికి ఆవేశం కలిగింది.

రాముణ్ని నూతనశక్తి ఆవహించింది.

ఒక్కసారి వాడి హృదయం కట్లు తెంచుకుంది. వెళ్ళాల్సిందే! చూడాల్సిందే! వినాల్సిందే! ఏమైనాసరే! మేనమామ ఏమన్నాసరే! వెంటనే లేచాడు. గది తలుపు పగలగొట్టాడు. దొడ్డిగోడ దూకాడు. మీటింగుదగ్గరకు పరిగెత్తాడు!

వాడు వెళ్ళేటప్పటికి కామ్రేడ్ సోమేశ్వరప్రసాద్ ఉపన్యసిస్తు న్నాడు. 'అష్టకష్టాలు పడి, రాత్రి అనక పగలనక చెమటోడ్చి భూమిని పండించేది మీరు. ఆ పంటనీ, భోగాల్ని అనుభవించేది మరొకరు' అన్నాడు

రాముడు తదేకధ్యానంతో విన్నాడు. వాడికిది చిత్రంగా కనిపించింది. ఇప్పటి వరకూ భూమి ధనవంతుల సొంతం గనుక కూలి ఇచ్చి వ్యవసాయం చేయించుకుంటున్నారనుకున్నాడు. కూలి ఇవ్వటమే వాళ్ళ ధార్మిక గుణాన్ని నిరూపిస్తూందనుకున్నాడు. ఇప్పుడు సోమేశ్వర ప్రసాద్ ఎవ్వరు పండించుకున్న భూమి వారిదే అంటున్నాడు. డబ్బుని సృష్టించేది మీరు, అనుభవించేది యింకొకరు అన్నాడు సోమేశ్వర ప్రసాద్. రాముడు ఆశ్చర్యపడ్డాడు. ఇన్నాళ్ళూ వాళ్ళు దయతలచి వీళ్ళకి డబ్బు పెట్టుబడిపెట్టి పోషిస్తున్నారనుకున్నాడు. ఇప్పుడు డబ్బసలు వీళ్ళదే వీళ్ళదే! వీళ్ళ డబ్బునే వాళ్ళు దోచుకుంటున్నారు. అంటున్నాడు సోమేశ్వరప్రసాద్. ప్రభుత్వాన్ని నిలిపేది మీరు, పెత్తనం చేసేది వాళ్ళు అన్నాడు సోమేశ్వర ప్రసాద్ రాముడు నోరు తెరుచుకొని విన్నాడు. ఇన్నాళ్ళూ వీళ్ళ శ్రేయస్సు కోసం కనికరించి, ధనవ్యయంచేసి వీళ్ళని కాపాడ్డానికి వాళ్ళు ప్రభుత్వాన్ని నెలకొల్పారనుకున్నాడు. ఇప్పుడు మీరు నిలబెడుతున్న ప్రభుత్వాన్ని వాళ్ళు స్వార్థానికి వుపయోగించుకుంటున్నారు. అంటున్నాడు, కామ్రేడ్ సోమేశ్వరప్రసాద్. రాముడు కదలకుండా, మెదలకుండా, కనురెప్ప వేయకుండా వుపన్యాసం విన్నాడు. కామ్రేడ్ సోమేశ్వర ప్రసాద్ తన వుపన్యాసాన్ని ఈ విధంగా ముగించాడు.

"మనం బానిసలం. బానిస లక్షణాలు మన రక్తంలో జీర్ణించిపోయినయ్. అందుకని పరదేశం వొచ్చి గడపలో అడుగుపెట్టినా మనకు చలనంలేదు వింటాం. ఊరుకుంటాం.. లెండి. లెండి.

రాముడు వుపన్యాసం సాంతంగా విన్నాడు. ఉలికిపోయాడు. ఉపన్యాసం పూర్తవ్వగానే గబగబా వేదిక దిగుతున్న సోమేశ్వర ప్రసాద్ దగ్గరకు వెళ్ళాడు. తడబాటుతో అడిగాడు—"నన్ను కూడా జేర్చుకోండి"

కామ్రేడ్ సోమేశ్వర ప్రసాద్ రాముణ్ని ఒక్క క్షణం తేరిపార

చూశాడు. చిరునవ్వు నవ్వాడు. బుగ్గమీద చిటికె వేస్తూ చెప్పాడు —
"నువ్వు పిల్లవాడివి. తొందరేం! ఇంటికి వెళ్ళు."

"ఇల్లులేదు"

"అమ్మ ఎక్కడుంటే అక్కడకు వెళ్ళు."

"అమ్మలేదు."

"నాన్న దగ్గరకు వెళ్ళు."

"నాన్న లేడు"

"ఎక్కడ వుంటున్నావు?"

"మామయ్య దగ్గర"

కామ్రేడ్ సోమేశ్వరప్రసాద్ కొంచెంసేపు ఆలోచించాడు. చివరికి 'అక్కడికే వెళ్ళు' అని చెప్పి, చిరునవ్వు నవ్వి వెళ్ళిపోయాడు.

రాముకి గుండెలు గుభీలుమన్నయ్. తనేం చేశాడు! తన్నెందుకు తీసుకోరు? తనలో ఏం లోటుంది? తనెందుకూ పనికిరాడూ! రంగడీ గంగడీపాటి చెయ్యడూ? వెక్కెక్కి ఏడుస్తూ అక్కడే-సోమేశ్వరప్రసాద్ విడిచిపెట్టిపోయిన చోట చతికిలపడ్డాడు.

చీకటి పడింది.

మేనమామ రాముణ్ణి వెతుక్కుంటూ వచ్చాడు. చూశాడు. తాను వద్దన్నకొద్దీ, తనమాట తిరస్కరించి మీటింగుకు వచ్చాడని మండిపోయాడు.

"రామూ?"

"రాముడూ?"

"ఒరేయ్?"

రాముడు ఉలిక్కిపడి, మామని గుర్తుపట్టాడు. లేచి నిలబడ్డాడు.

"వెధవా! అప్పుడే కళ్ళు నెత్తికొచ్చినయ్? ఇంత పొగరా. నే చెప్పిందేమిటి? నువ్వు చేసిందేమిటి!" అని చేతిలోవున్న పలుపుతో బాదాడు. ఎడాపెడా కొట్టాడు. తుక్కు రేగేటట్టు కొట్టాడు. రాముడు మాత్రం కుఁయి కఁయిమనలేదు. అలాగే నిలబడ్డాడు. మేనమామని తేరిపార చూచాడు.

వాటి చూపులు మేనమామకి వికృతంగా, వికారంగా, కనిపించినయ్. అతనికి భయంవేసింది. ఎగశ్వాసతో అలాగే నిలబడిపోయాడు. చేతిలోని పలుపు అలాగే వేలాడుతూ వుంది.

రాముడు దృఢనిశ్చయంతో నెమ్మదిగా అడుగులు వేసుకుంటూ బయల్దేరాడు. మేనమామ పిలుద్దామనుకున్నాడు. మళ్ళీ బాదామనుకున్నాడు. కాని ఏదో భయం-ఏదో అనుమానం-ఏదో ఆందోళన. పిలవలేకపోయాడు; కదల్లేకపోయాడు.

రాముడు నెమ్మదిగా సోమేశ్వరప్రసాద్ విడిదికి వెళ్ళాడు. అతడు రాముణ్ని చూచి, "ఏం అబ్బాయి, మళ్ళీ వొచ్చావ్?" అన్నాడు.

"నన్ను మీ పార్టీలో చేర్చుకోండి" అన్నాడు రాముడు. ఈసారి రాముడు మాటల్లో ఆతురతగానీ, ఆవేశంగానీ లేదు.

"ఎందుకబ్బాయి అంత తొందర?"

"తొందరకాదు"

"మరేమిటి?"

"చేరాలి"

"ఆఁ!!"

రాముడు మాట్లాడలేదు. సోమేశ్వరప్రసాద్ లాంతరు పైకెత్తి చూశాడు. రాముడి చెంపలమీద కణుపులు కనిపించాయి — "ఏమిటది?" అన్నాడు.

రాముడు మాట్లాడలేదు.

"ఎవరు కొట్టారు?"

"మామయ్య"

"ఎందుకు?"

"మీటింగు కొచ్చానని"

కామ్రేడ్ సోమేశ్వరప్రసాద్ ఒక్క క్షణం ఆలోచించాడు. రాముణ్ణి నఖశిఖ పర్యంతం పరిశీలించాడు—"రా, నాయనా" అని కౌగలించుకున్నాడు.

తెల్లవారికూడా రాముడు రాకపోయేటప్పటికి రాముడి మేనమామ పోలీసులకు రిపోర్టుచేశాడు. పోలీసులు ఊరంతా గాలించారు. కామయ్య యిల్లు వెతికారు. కామయ్య ఇంట్లో బావి వెతికారు. కామ్రేడ్ సోమేశ్వర ప్రసాద్ విడిది వెతికారు కాని ఎక్కడా రాముడు కనిపించలేదు.

కామ్రేడ్ సోమేశ్వరప్రసాద్ మాత్రం రాముడి మేనమామ కామయ్య కనిపించినప్పుడల్లా "తొందరపడకూ, వస్తాళ్ళే! పెద్దవాడయి వస్తాడు" అంటూ వుండేవాడు. కొంతకాలం గడచిం తరువాత ఎవ్వరో రాముడ బొమ్మ పేర్లతో చూచానని చెబితే కామయ్య నమ్మలేదు. "ధూత్" అన్నాడు.